# కృతజ్ఞతా భావం గురించి
# హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఆచరణాత్మక ఆదర్శం

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 28.08.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ. أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ. بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం పతాకాన్ని ప్రపంచంలో ఎగురవేయడానికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చేసిన ప్రయత్నాలు స్పష్టంగా ఉన్నాయి. ఆయన అలైహిస్సలాం తన ఈ లక్ష్యాన్ని నెరవేర్చడానికి ఏ రూపంలోనైనా సేవ చేసిన తన సహాయకులకు కూడా ఎంతో కృతజ్ఞులై ఉండేవారు.

అందుకే హజ్రత్ అక్దస్ అలైహిస్సలాం 1899 అక్టోబర్ 4న ఒక ప్రకటనలో ఈ విధంగా ఉదేశించారు: ప్రతి దైవజనుల సమూహానికి వారి ప్రారంభ దశలో చందాల (ఆర్థిక సహాయం) అవసరం ఏర్పడటం అల్లాహ్ తఆలా సున్నత్ (నియమం). మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూడా అనేకసార్లు అనుచరుల నుండి చందాలు సేకరించారు, అందులో హజ్రత్ అబూ బకర్ రజియల్లాహు అన్హు అందరికంటే ముందున్నారు. కావున ధైర్యంతో సహాయం చేయడానికి ఆలస్యం చేయకుండా అడుగు ముందుకు వేయవలెను. ప్రతి ఒక్కరూ తమ స్తోమతకు తగినట్లుగా ఈ లంగర్ ఖానా (అన్నదాన సత్రం) కోసం సహాయం చేయవలెను. వీలైతే ఒక విధమైన పద్ధతి ఏర్పాటు కావాలని నేను కోరుకుంటున్నాను. తద్వారా లంగర్ ఖానా నిర్వహణ భారము నుండి మేము విముక్తి పొంది, మా పనిలో నిశ్చింతగా నిమగ్నమై ఉండగలము, మా సమయానికి ఎటువంటి ఆటంకం కలగదు. మాకు సహాయం చేసేవారు, చివరికి దేవుని సహాయాన్ని చూస్తారు.

ఈ సహాయం, గట్టి కృషిలో ప్రథమ స్థానంలో మా నిస్వార్థ, వినమ్రులైన అల్లాహ్ కోసం నా ప్రియమైన మిత్రుడు మౌల్వీ హకీమ్ నూరుద్దీన్ రజియల్లాహు అన్హు ఉన్నారని రాయకుండా నేను ఉండలేకపోతున్నాను. ఆయన కేవలం ఆర్థిక సహాయం మాత్రమే చేయలేదు, ప్రపంచ సంబంధాలన్నింటినీ వదులుకుని, సన్యాసి వస్త్రాన్ని ధరించి, తన స్వగ్రామం నుండి వలస వచ్చి మరణించేంత వరకు ఖాదియాన్‌లో వచ్చి స్థిరపడ్డారు, ఎల్లప్పుడూ సేవకు సిద్ధంగా ఉన్నారు. నేను కోరుకుంటే ఆయనను తూర్పుకైనా పంపగలను లేదా పడమరకైనా పంపగలను. నా దృష్టిలో వీరు ఎలాంటి వారంటే, వీరి గురించే 'బారాహీనె అహ్మదియ్య'లో ఈ విధంగా దైవవాణి అందినది. اَصۡحَابُ الصُّفَّةِ وَمَا أَدۡرَاكَ مَا أَصۡحَابُ الصُّفَّةِ అనగా అస్హాబుస్ సుఫ్ఫా, అస్హాబుస్ సుఫ్ఫా అంటే ఎవరో నీకేమి తెలుసు? మరియు వారి తర్వాత రెండవ స్థానంలో అల్లాహ్ కోసం నా మిత్రుడు మౌల్వీ అబ్దుల్ కరీమ్ సియాల్కోటీ గారున్నారు. ఆయనకు మొదట్నుంచీ దేవుడు ఐహిక పదవులు, హోదాల పట్ల ఆసక్తిని ఇవ్వలేదు. కానీ ఇప్పుడు ఆయన ప్రాపంచిక ఆలోచనలకు కూడా పూర్తిగా స్వస్తి పలికి ఈ గుమ్మం వద్ద కూర్చున్నారు. రేయింబవళ్లు తన శక్తికి మించి మెదడుకు పనిపెడుతూ ధర్మసేవ చేస్తున్నారు. ఆయన శుక్రవారం (జుమా) నమాజులో పవిత్ర ఖుర్‌ఆన్‌లోని అనేక సత్యాలను, జ్ఞానాలను వివరిస్తూ ముస్లింలకు ప్రయోజనం చేకూరుస్తున్నారు. ఇక మౌల్వీ హకీమ్ నూరుద్దీన్ గారి స్వగ్రామానికే చెందిన హకీమ్ ఫజల్ దీన్ గారున్నారు; ఆయన కూడా దాదాపు ఇక్కడే నివసిస్తూ సేవల్లో నిమగ్నులై ఉన్నారు.

ఆ తర్వాత ఆయన అలైహిస్సలాం డాక్టర్ బోడే ఖాన్ గారు, ఖలీఫా రషీదుద్దీన్ లాహోరీ గారు, డాక్టర్ మిర్జా యాకూబ్ బేగ్ కలానూరీ గారు, డాక్టర్ ముహమ్మద్ ఇస్మాయీల్ గారు, డాక్టర్ అబ్దుల్ హకీమ్ ఖాన్ గారు, మిర్జా ఖుదా బక్ష్ గారు, సాహిబ్జాదా సిరాజుల్ హక్ గారు మరియు సేఠ్ అబ్దుర్రహ్మాన్ గారి గురించిన విషయాలను కూడా పేర్కొన్నారు. సేఠ్ గారు క్రమం తప్పకుండా నెలకు వంద రూపాయలు పంపుతారని, అనేకసార్లు ఐదువందల రూపాయల వరకు కూడా పంపారని అన్నారు. అలాగే లాహోర్ వ్యాపారి అయిన అల్లాహ్ కోసం నా మిత్రుడు షేఖ్ రహ్మతుల్లా గారి గురించి ప్రస్తావిస్తూ, ఆయన న్యాయపరమైన కేసుల ఖర్చుల కోసం పెద్దమొత్తంలో నగదును కానుకగా సమర్పించారని తెలిపారు. అనంతరం ఆయన నవాబ్ ముహమ్మద్ అలీ ఖాన్ గారి గురించి కూడా ప్రస్తావించారు.

హజ్రత్ అక్దస్ అలైహిస్సలామ్ చిన్నపాటి సేవ చేసిన వారి పట్ల కూడా ఎంతో కృతజ్ఞతతో ఉండేవారు. ఖ్వాజా కమాలుద్దీన్ గారి వీధిలో ఒక వ్యక్తి ఫాలూదా (ఒక విధమైన తియ్యని పదార్థం) విక్రయించేవాడు. ఆయన ఒకసారి హజ్రత్ గారికి ఫాలూదా సమర్పించాలని తన కోరికను వెలిబుచ్చాడు. దాంతో హజ్రత్ గారు వారి ఇంటికి విచ్చేసినప్పుడు, ఆయన అనుమతితో ఆ వ్యక్తిని పిలిపించారు. అతడు ఫాలూదా తయారుచేసి హజ్రత్ గారికి సమర్పించాడు. ఆయన అలైహిస్సలాం అది ఆస్వాదించి "చాలా బాగుంది" అని అన్నారు. ఆ తర్వాత అతడు మిగతా మిత్రుల కోసం కూడా పది–ఇరవై గ్లాసుల ఫాలూదాను పంపాడు. హజ్రత్ గారు అతనికి రెండు రూపాయలు పంపగా, అతడు ఆ డబ్బును తీసుకోవడానికి నిరాకరించి, నాకు డబ్బుతో పనిలేదు, నన్ను హజ్రత్ గారి సమక్షంలోకి తీసుకెళ్లండి అని కోరాడు. దాంతో అతడు హజ్రత్ గారి వద్దకు వెళ్లగా, ఆయన అతని కోసం ప్రార్థన (దుఆ) చేసి "జజాకల్లాహ్" (అల్లాహ్ మీకు మంచి ప్రతిఫలాన్ని ఇచ్చుగాక) అని దీవించారు.

హజ్రత్ ఇబ్రాహీమ్ బఖాపూరీ రజియల్లాహు అన్హు వివరిస్తూ ఒకసారి సియాల్కోట్ జమాఅత్ నుండి కొందరు మిత్రులు కానుకగా కొన్ని రూపాయలను సమర్పించారు. హజ్రత్ అలైహిస్సలాం మొదట "అల్హమ్దులిల్లాహ్" (అల్లాహ్‌కే స్తోత్రాలు) అని, ఆ తర్వాత "జజాకముల్లాహ్" అని అన్నారు. దీనివల్ల మన విశ్వాసం మరింత పటిష్టమైంది; ఎందుకంటే హజ్రత్ గారు మొదట దేవునికి కృతజ్ఞతలు తెలిపారు, ఆ తర్వాత మా కోసం ప్రార్థన (దుఆ) చేశారు. మరొక సంఘటనను జుల్ఫికార్ అలీ ఖాన్ గౌహర్ గాఇట్లు వివరించారు. ఒకసారి హజ్రత్ అలైహిస్సలాం బైతుద్దుఆ (ప్రార్థనా గది) కింద ఉన్న గది నుండి బయటకు వచ్చారు. నేను దానికి ఎదురుగానే నివసిస్తూ ఉండేవాడిని. హజ్రత్ గారు తమ జుట్టుకు గోరింటాకు పెట్టుకుని ఉన్నారు. ఆయన నాతో మా కోసం ఇక్కడికి కొంచెం ఆహారం తీసుకు రావాలని మౌల్వీ సయ్యద్ సర్వర్ షా గారికి చెప్పండి అని అన్నారు. నేను ఆ సందేశాన్ని అందించగా, అక్కడ ఆహారం పూర్తిగా అయిపోయిందని తెలిసింది. హజ్రత్ గారి కోసం ఆహారమేమీ మిగలలేదని తెలిసి మౌల్వీ గారి ముఖం చిన్నబోయింది. ఏదేమైనా, ఆయన ఒక చిన్న గిన్నెలో పాలు, మూడు టోస్ట్‌లు (రస్కులు) మరియు చక్కెర తీసుకుని హజ్రత్ గారి సమక్షంలోకి హాజరయ్యారు. వేరే ఏమీ లేదని మనవి చేసుకున్నారు. హజ్రత్ గారు తన ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్న అపారమైన కృతజ్ఞతా భావంతో ఆ ఆహారాన్ని స్వీకరించారు. రెండు టోస్ట్‌లను తీసి, చక్కెర అంటించుకొని తిని నీళ్లు తాగారు.

1900 ఆగస్టులో ఆయన అలైహిస్సలాం ఒక లేఖ ద్వారా హజ్రత్ నవాబ్ ముహమ్మద్ అలీ ఖాన్ రజియల్లాహు అన్హు ఒక అత్యంత విలువైన వస్త్రాన్ని కానుకగా పంపించినందుకు గాను వారికి ధన్యవాదాలు తెలిపారు. ఆ దుస్తులకు బదులుగా హజ్రత్ గారు వారి కోసం ఈ విధంగా ప్రార్థించారు: అల్లాహ్ తఆలా దీనికి ప్రతిఫలంగా తన అపరిమితమైన, అపారమైన కృపాకటాక్షాలను కురిపించుగాక! భక్తి/ధర్మ నిష్ఠ అనే వస్త్రంతో దైవమిత్రులు, సజ్జనుల రంగులో పరిపూర్ణంగా మిమ్మల్ని అనుగ్రహించుగాక.

మరొక లేఖలో హజ్రత్ డాక్టర్ ఖలీఫా రషీదుద్దీన్ రజియల్లాహు అన్హు గారితో ఇలా అన్నారు: మీ వైపు నుండి 50 రూపాయలు ఒక క్లిష్ట సమయంలో అందాయి. దుర్మార్గుడైన ఒకడు కోర్టులో నాపై కేసు పెట్టిన ఇటువంటి అత్యవసరమైన సమయంలో మీరు నిరంతరం ఆర్థిక సహాయం చేయడం ఎంతో కృతజ్ఞతకు పాత్రమైనది.

ఒక అనుచరుడు ఈ విధంగా వివరిస్తున్నారు: నేను అహ్మదియ్యత్‌ను స్వీకరించి, ఆ విషయాన్ని నా ఇంట్లో

వారి నుండి దాచిపెట్టాను. కొంతకాలం తర్వాత ఆ రహస్యం బయటపడింది. నువ్వు అహ్మదీవి అయ్యావని చెప్పి మా నాన్నగారు నన్ను తీవ్రంగా తిరస్కరించి ఇంట నుండి గెంటివేశారు. దాంతో నేను ఒక దుకాణం తెరుచుకున్నాను. నేను దర్జీ పని చేసేవాడిని. హజ్రత్ అక్దస్ అలైహిస్సలాం కోసం ఒక దుస్తుల జతను తయారుచేయాలని నా మనస్సులో తీవ్రమైన కోరిక కలిగింది. అందుకని నేను ఒక కుర్తా, షల్వార్, ఒక కోటును కూడా తయారుచేశాను. ఎవరి దగ్గరో ఖాదియాన్ వెళ్లడానికి ప్రయాణ ఖర్చులు అడిగి తీసుకుని అక్కడికి చేరుకున్నాను. అది శుక్రవారం రోజు. హజ్రత్ గారు ఈ రోజు జుమా నమాజులో ఈ దుస్తులను ధరించాలనేది నా కోరిక. నాకు దుకాణంలో ఖాజీ జియావుద్దీన్ గారు కనిపించారు. వారితో ఈ విషయం చెప్పగా, ఆయన నన్ను హజ్రత్ గారి వద్దకు తీసుకెళ్లారు. హజ్రత్ గారు ఒక బల్ల పై కూర్చుని ఏదో రాస్తున్నారు. ఆయనకు దగ్గరలోనే ఖ్వాజా కమాలుద్దీన్ గారు చాపపై కూర్చుని ఉన్నారు. మేము కూడా కూర్చున్నాము. ఖ్వాజా గారు మమ్మల్ని నేను మీ ఉద్దేశాన్ని హజ్రత్ గారికి విన్నవించమంటారా? అని అడిగారు. ఆ తర్వాత ఖ్వాజా గారు ఆ దుస్తులను హజ్రత్ గారికి సమర్పిస్తూ, హజ్రత్ గారు ఈ దుస్తులను ధరించి జుమా నమాజ్ చదవాలనేది ఈ కుర్రాడి కోరిక అని మనవి చేశారు. హజ్రత్ గారు వెంటనే (లోపలికి వెళ్లి) ఆ దుస్తులను ధరించారు. కోటు కొంచెం బిగుతుగా ఉండింది. నేను కుట్లు విప్పి దానిని సరిచేయడానికి బజారుకు తీసుకెళ్లాను. తిరిగి తీసుకువచ్చిన తర్వాత హజ్రత్ గారు మళ్లీ దానిని తొడుక్కున్నారు, కానీ అది ఇప్పటికీ బిగుతుగానే ఉంది. గుండీలు పడటం లేదు. అయినప్పటికీ, నా సంతోషం మరియు అభిమానం కోసం ఆయన దానిని లాగి పట్టి ఎలాగోలా గుండీలు పెట్టుకున్నారు.

అహ్మదీ సమాజానికి రాసిన ఒక లేఖలో ఆయన అలైహిస్సలాం ఈ విధంగా వ్యాఖ్యానించారు: అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు. అందరికంటే ముందుగా నా హృదయంలో అల్లాహ్ తఆలా పట్ల కృతజ్ఞతా భావం పొంగిపొర్లుతోంది. అతడు నా జమాఅత్‌కు సత్యమైన నిష్ఠ, ప్రేమ మరియు సానుభూతిని అనుగ్రహించాడు. అల్లాహ్ తఆలా కృప వారిపై లేకపోయి ఉంటే, వారు తమ స్వంత ఆర్థిక ఇబ్బందులు మరియు తక్కువ ఆదాయం ఉన్నప్పటికీ, అనుచరుల రజియల్లాహు అన్హుమ్ అడుగుజాడల్లో నడుస్తూ తమ శక్తికి మించి ఆర్థిక సేవల్లో నిమగ్నమయ్యే ఈ భాగ్యం వారికి ఎంతమాత్రమూ లభించేది కాదు. వారందరి సంపదలలో అల్లాహ్ తఆలా అభివృద్ధిని ప్రసాదించాలని, ధార్మిక లక్ష్యాల నెరవేర్పు కోసం వారు చేస్తున్న ఈ సహాయ సహకారాలు, ఇరు లోకాలలో వారి సంక్షేమానికి కారణం కావాలని నేను ప్రార్థిస్తున్నాను. ఆమీన్ సుమ్మ ఆమీన్.

అనంతరం మరొక సందర్భంలో ఈ విధంగా అన్నారు: అల్లాహ్ తఆలా ఎవరిపై అయితే తన కృపను కురిపించాడో, దానికి కృతజ్ఞత తీర్చుకునే సరైన మార్గం ఏమిటంటే అతని సృష్టి పట్ల పరోపకారంతో, మంచిగా వ్యవహరించడం, అంతేగాని దేవుడు ప్రసాదించిన ఆ అనుగ్రహం చూసి గర్వించడం లేదా క్రూరంగా పేదలను తొక్కి పడేయడం కాదు. అంటే ప్రజలకు సహాయం చేయాలని ఆయన సూచించారు.

అల్లాహ్ తఆలా ఆయనకు (అలైహిస్సలాం) ప్రజల వ్యవహారాలు మరియు సంఘటనల గురించిన సమాచారాన్ని ముందే తెలియజేసేవాడు. కొన్నిసార్లు అల్లాహ్ తఆలా దైవిక జ్ఞానం ప్రకారం అవి నెరవేరడానికి సమయం పట్టేది. ఇటువంటి సమయాల్లో ఆయన అలైహిస్సలాం తీవ్రంగా ప్రార్థనలలో నిమగ్నమైపోయేవారు. ఇక ఆ విషయం నెరవేరిన వెంటనే, ఆయన అల్లాహ్ తఆలా సమక్షంలో అత్యంత కృతజ్ఞతతో సజ్దా చేసేవారు.

ఆయన అలైహిస్సలాం ఒక సంఘటనను వివరిస్తూ ఈ విధంగా అన్నారు: ఒకసారి శరమ్‌పత్ సోదరుడైన బిషంబర్ దాస్ అనే హిందూ వ్యక్తికి సంబంధించి నేను ఒక భవిష్యవాణి వినిపించాను. అదేమిటంటే అతడు క్రిమినల్ కేసు నుండి విముక్తి పొందడు, కానీ అతని శిక్షాకాలంలో సగం జైలు శిక్ష తగ్గుతుంది. అయితే యాదృచ్ఛికంగా తీర్పు వెలువడినప్పుడు, అతని వారసులు అంచనాలకు భిన్నంగా బిషంబర్ దాస్ కేసు నుండి విడుదలయ్యాడని ప్రచారం చేశారు. నేను పెద్ద మసీదుకు నమాజ్ చదవడానికి వెళ్లినప్పుడు, ఒక వ్యక్తి వచ్చి బిషంబర్ దాస్ విడుదల య్యాడని, బజారులో అతనికి అభినందనలు తెలుపుతున్నారని నాకు సమాచారం అందించాడు. ఇక ఇప్పుడు మిర్జా గారి భవిష్యవాణి నెరవేరలేదని హిందువులు దీనిపై విమర్శలు చేస్తారు కదా అని నాకు చాలా బాధ అనిపించింది.

ఆ బాధ వల్ల నాకు నమాజ్ లోని ఒక్కో రకాత్ ఒక్కో సంవత్సరంతో సమానంగా అనిపించింది. నమాజ్‌లో ఒక రకాత్ తర్వాత నేను సజ్దాలోకి వెళ్లినప్పుడు నా ఆవేదన అత్యున్నత స్థాయికి చేరుకుంది. అప్పుడు నాకు దైవవాణి అందినది. لَا تَخَفْ اِنَّكَ اَنْتَ الْاَعْلٰى (భయపడకు, నిశ్చయంగా నీవే పైచేయి కలిగి ఉంటావు). ఆ తర్వాత ఈ భవిష్యవాణి ఎలా నెరవేరుతుందా అని నేను వేచి చూశాను, కానీ ఎలాంటి సూచనా కనిపించలేదు. నేను పదేపదే శరమ్‌పత్‌ను అడిగినప్పటికీ, అతడు విడుదలయ్యాడనే చెప్పేవాడు. ఈ విధంగా దాదాపు ఆరు నెలలు లేదా అటు ఇటుగా గడిచి పోయాయి. దుర్మార్గులైన ప్రజలు ఎగతాళి, పరిహాసాలు చేస్తూ ఉండేవారు, కానీ శరమ్‌పత్ మాత్రం ఎప్పుడూ ఎగతాళి చేయలేదు. ఒకరోజు ఉదయం బటాలా నుండి ఒక తహసీల్దార్ ఖాదియాన్‌కు రావడం జరిగింది. ఆయన ఇంకా గుర్రం దిగకముందే, హిందువులు ఆయనకు నమస్కరించడానికి వచ్చారు. ఆయన బిషంబర్ దాస్‌ను చూసి, నువ్వు జైలు శిక్ష నుండి విడుదలైనందుకు మేము సంతోషించాము, కానీ నువ్వు కేసు నుండి పూర్తిగా విముక్తి పొందలేదని అన్నాడు. నేను ఆ మాట వినగానే కృతజ్ఞతతో సజ్దా చేశాను. ఆ తర్వాత శరమ్‌పత్‌ను అడిగాను: నువ్వు ఇన్ని రోజులు ఎందుకు అబద్ధం చెప్పి నన్ను బాధపెట్టావు? అందుకు అతడు, ఒక ఇబ్బంది వల్ల నేను అబద్ధం చెప్పాల్సి వచ్చింది. లేకపోతే పెళ్లి సంబంధాల సమయంలో మా సమాజంలో ఇటువంటి విషయాలపై చాలా వేలెత్తి చూపుతారు. ప్రవర్తన సరిగ్గా లేదని రుజువైతే సంబంధాలు దొరకడం కష్టమైపోతుందని చెప్పాడు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విధంగా ఉపదేశిస్తున్నారు: నా సూచనలు, అద్భుతాలు వ్యక్తమవని జాతి ఏదీ లేదు మరియు నా సూచనలకు సాక్షిగా లేని తెగ ఏదీ లేదు. ఈ సూచనలకు సాక్షులు పది కోట్ల మంది అని చెప్పినా అది ఎంతమాత్రమూ అతిశయోక్తి కాబోదు. కానీ విరోధుల పరిస్థితి చూస్తే ఏడుపు వస్తుంది. ఎందుకంటే వారు దీని నుండి ఎటువంటి ప్రయోజనమూ పొందలేదు. వీరికి చూపించబడిన ఈ సూచనలను కనుక హజ్రత్ ఈసా బిన్ మర్యమ్ అలైహిస్సలాం కాలంలో యూదులకు చూపించి ఉంటే, వారు ضُرِبَتْ عَلَيْهِمُ الذِّلَّةُ وَالْمَسْكَنَةُ అనగా దిగజారుడుతనానికి, దరిద్రానికి అర్హులు అయ్యేవారు కారు. ఒకవేళ లూత్ అలైహిస్సలాం జాతి ఈ సూచనలను వీక్షించి ఉంటే, అది ఒక భయంకరమైన భూకంపం ద్వారా భూమి పొరలలో కూరుకుపోయేది కాదు. కానీ అయ్యో ఆ హృదయాలు! అవి రాతి కంటే కూడా గట్టివిగా రుజువయ్యాయి, ప్రతి రకమైన రీతిలో వారి హృదయాల చీకటి పెరుగుతూనే పోయింది.

అల్లాహ్ తఆలా మనకు కృతజ్ఞత వాస్తవిక అవగాహనను ప్రసాదించడంతో పాటు, దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి సత్యమైన దాసుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ లోకి వచ్చి సత్యమైన కాంతిని, దివ్య దృష్టిని, దైవ జ్ఞానాన్ని కూడా అనుగ్రహించుగాక!

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ـ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا ـ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ـ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ـ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِی الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ ـ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ـ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ـ